సాక్షి మంచిర్యాల


మంగళవారం, 5, సెప్టెంబర్, 2023



బోధనలో ఉత్తమం 8లో

ఉపాధ్యాయులు వినూత్న రీతిలో విద్యా బోధన చేస్తున్నారు. ఉపాధ్యాయుల దినోత్సవం సందర్భంగా జిల్లాలోని కొంత మంది ఉత్తమ ఉపాధ్యాయులపై కథనం.

అన్నం కోసం వచ్చి... అసువులుబాసి..



ఏసీసీ కాలనీలో విద్యుత్‌షాక్‌తో ఎడ్ల రాజేందర్(50), కొడుకు అరుణ్ కుమార్(17) మృతిచెందారు. మధ్యాహ్నం భోజనం చేసేందుకు వచ్చి ప్రమాదానికి గురయ్యారు. 8లో

గరిష్టం/కనిష్టం 30.2 /25.1

వాతావరణం

ఆకాశం పూర్తిగా మేఘావృతమై ఉంటుంది. ఉష్ణోగ్రతలు తగ్గుతాయి. ఉపరితల ఆవర్తనం ప్రభావంతో జిల్లా అంతటా మోస్తరు వానలు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

గూడెంలో శ్రావణ సందడి



సత్యదేవున్ని దర్శించుకుంటున్న భక్తులు..

దండేపల్లి: మండలంలోని గూడెం శ్రీసత్య నారాయణస్వామి ఆలయంలో శ్రావణ సందడి నెలకొంది. సోమవారం భక్తులు అధిక సంఖ్యలో వచ్చి సత్యదేవున్ని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. పలువురు భక్తులు సామూహిక సత్యనారాయణ వ్రతాలు నోముకున్నారు. దీంతో ఆలయం వద్ద సందడి కనిపించింది.

ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడిగా సమ్మయ్య

వేమనపల్లి: ఎమ్మార్పీ ఎస్ జిల్లా అధ్యక్షుడిగా నీల్వాయికి చెంది న చెన్నూరి సమ్మయ్య మాదిగ ఎన్నికయ్యా రు. మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు జిల్లా ఇన్‌చార్జి గుండా థామస్ మాదిగ ఆధ్వర్యంలో సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. చెన్నూరి సమ్మయ్య ఎంఎస్ఎఫ్ కాలేజీ కమిటీ అధ్యక్షుడిగా విద్యార్థి విభాగం వేమనపల్లి మండల, జిల్లా అధ్యక్షుడిగా గతంలో పని చేశారు. ఎస్సీ వర్గీకరణ ఉద్యమంలో మందకృష్ణ మాదిగతో కలిసి జైళ్లో 20 రోజులు గడిపారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి



కలెక్టర్‌కి వినతిపత్రం ఇస్తున్న రంజిత్

నస్పూర్: జిల్లాలోని గిరిజన హాస్టల్ వర్కర్లకు పెండింగ్ వేతనాలు చెల్లించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి దుంపల రంజిత్‌కుమార్ డిమాండ్ చేశారు. వర్కర్లతో కలిసి సోమవారం ప్రజావాణిలో కలెక్టర్ బదావత్ సంతోష్‌కు వినతిపత్రం అందించారు. అనంతరం రంజిత్‌కుమార్ మాట్లాడుతూ ఎస్టీ గిరిజన హాస్టళ్లలో పనిచేస్తున్న వర్కర్లకు 9 నెలలుగా వేతనాలు చెల్లించడం లేదని తెలిపారు. ఈ నెల 6 వరకు వేతనాలు చెల్లించకుంటే 7 నుంచి సమ్మె చేస్తామని హెచ్చరించారు.

బైపీసీ విద్యార్థులకు కౌన్సెలింగ్



ధ్రువీకరణ పత్రాలు పరిశీలిస్తున్న అధికారులు

బెల్లంపల్లి: బెల్లంపల్లి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల హెల్ప్‌లైన్ కేంద్రంలో సోమవారం ఎంసెట్ బైపీసీ విద్యార్థులకు కౌన్సెలింగ్ ప్రక్రియ ప్రారంభమైంది. హెల్ప్‌లైన్ కేంద్రానికి వచ్చిన విద్యార్థుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకుని ధృవీకరణ పత్రాలను పరిశీలించారు. తర్వాత కౌన్సెలింగ్ చేశారు. తొలిరోజు 311 మంది కౌన్సెలింగ్‌కు హాజరైనట్లు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ రవీందర్‌రెడ్డి తెలిపారు.

బ్యాడ్మింటన్‌లో జిల్లా క్రీడాకారుల ప్రతిభ





గోల్డ్ మెడల్ సాధించిన హర్షవర్ధన్, శ్రీవల్లి

మంచిర్యాలఅగ్రికల్చర్: ఈ నెల 1 నుంచి 4వ తేదీ వరకు హైదరాబాద్‌లో చేతన్ ఆనంద్ బ్యాడ్మింటన్ అకాడమీలో మెదక్ జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ నిర్వహించిన అండర్–17 బాల బాలికల సబ్ జూనియర్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ పోటీల్లో జిల్లా క్రీడాకారులు ప్రతిభ కనబర్చారని బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు పెద్దపల్లి ఏసీపీ ఎడ్ల మహేశ్, ప్రధాన కార్యదర్శి పుల్లూరి సుధాకర్ తెలిపారు. అదిత్య హర్షవర్ధన్ వరంగల్ క్రీడాకారుడు శౌర్యకిరణ్‌తో కలిసి డబుల్ స్లో ఫైనల్‌కి చేరుకుని విన్నర్‌గా నిలిచి గోల్డ్ మెడల్ సాధించగా, అనుముల శ్రీవల్లి హైదరాబాద్‌కు చెందిన అక్షయ చౌదరితో కలిసి డబుల్ స్లో ఫైనల్‌కి చేరుకుని సిల్వర్ మెడల్ సాధించారు. మెడల్స్ సాధించిన జిల్లా క్రీడాకారులను జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ చీఫ్ అడ్వైజర్ గాజుల ముఖేష్ గౌడ్, ఉపాధ్యక్షులు బాస్కర్ల వాసు, బండ మీనారెడ్డి, ట్రెజరీ సత్యపాల్‌రెడ్డి, సహాయ కార్యదర్శి రమేశ్‌రెడ్డి, మధు, రాజలింగు, కృష్ణ, హర్ష, లక్ష్మీనారాయణ అభినందించారు.

కమలంలో కోలాహలం!



- టికెట్లకు దరఖాస్తుల స్వీకరణ షురూ..
- జిల్లా నేతల్లో మొదలైన టికెట్ల హడావుడి
- నాలుగు స్థానాలకు ఆశావహుల అర్జీ

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: కమలం పార్టీలో అసెంబ్లీ టికెట్ల కోసం దరఖాస్తుల ప్రక్రియ మొదలైంది. ఇటీవల కాంగ్రెస్ పార్టీలో టికెట్ల కోసం దరఖాస్తులు స్వీకరించగా, ప్రస్తుతం వడపోత ప్రక్రియ నడుస్తోంది. ఇదే తీరుగా భారతీయ జనతా పార్టీ(బీజేపీ)లోనూ సోమవారం నుంచి అర్జీలు స్వీకరిస్తున్నారు. మొదటి రోజు మంచిర్యాల నియోజకవర్గం నుంచి ఒకరు దరఖాస్తు చేసుకున్నారు. ఈ సంఖ్య పెరిగే అవకాశం ఉంది. ఈ నెల 10వరకు ఆశావహుల నుంచి అప్లికేషన్లు తీసుకోనున్నారు. కాంగ్రెస్ పార్టీలో జనరల్, బీసీలకు రూ.50 వేలు, ఎస్సీ, ఎస్టీలకు రూ.25 వేలు రుసుం తీసుకున్నారు. బీజేపీలో ఎలాంటి ఫీజు తీసుకోవడం లేదు. దీంతో ఒక్కో నియోజకవర్గం నుంచి పదుల సంఖ్యలోనే దరఖాస్తులు వచ్చే అవకాశం ఉందని పార్టీ నాయకులు చెబుతున్నారు. ప్రతీ ఎన్నికల్లోనూ టికెట్ కోరుకునే వారి బయోడేటా, ఇతర వివరాలు పార్టీ తీసుకుంటుందని, ఈసారి కూడా అలాగే జరుగుతోందని పార్టీ నాయకులు చెబుతున్నారు. అయితే ఈసారి దరఖాస్తుల విధానం తీసుకురావడంతో ఎవరైనా తాము కోరుకున్న చోట పార్టీకి అర్జీ చేసుకునే అవకాశం ఉంది.



మంచిర్యాల టికెట్ కోసం హైదరాబాద్‌లో దరఖాస్తు చేసుకుంటున్న సొల్ల సందీప్

చెన్నూరు నుంచి వివేక్

ఎస్సీ రిజర్వుడ్ స్థానమైన చెన్నూరు నియోజకవర్గం నుంచి బీజేపీ కేంద్ర కార్యవర్గ సభ్యుడు, మాజీ ఎంపీ, వివేక్ వెంకటస్వామి పోటీలో ఉంటారని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఒక వేళ ఆయన ఇక్కడి నుంచి పోటీ చేయకపోతే అందుగుల శ్రీనివాస్‌తోపాటు మరికొందరు టికెట్‌పై ఆశలు పెట్టుకున్నారు. ఇక్కడ ప్రధాన ప్రత్యర్థిగా ఉన్న ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సుమన్ ఉండడంతో ఆస్థాయి నాయకుడినే బరిలో దింపాలని పార్టీ యోచిస్తోంది. 2014 లోక్‌సభ ఎన్నికల్లో పెద్దపల్లి స్థానం నుంచి బీఆర్ఎస్ తరఫున బాల్కసుమన్, కాంగ్రెస్ నుంచి వివేక్ పోటీపడగా, సుమన్ గెలుపొందారు. ఆ తర్వాత ఎంపీగా ఉన్న సుమన్ 2018లో చెన్నూరు నుంచి అసెంబ్లీకి పోటీ చేశారు. 2019 ఎన్నికల్లో వివేక్ లోక్‌సభ ఎన్నికల్లో టికెట్ దక్కకపోవడంతో పోటీకి దూరమయ్యారు. ఇక అప్పటి నుంచి అసెంబ్లీకి పోటీ చేయాలనే ఆలోచనతోనే చెన్నూరులోనే కార్యక్రమాలు చేపడుతున్నారు. ఈ క్రమంలో బీజేపీ నుంచి ఆయనే పోటీ చేసే అవకాశాలు ఉన్నాయి.

మంచిర్యాల టికెట్ కోసం..

జిల్లాలో జనరల్ స్థానంగా ఉన్న మంచిర్యాల నియోజకవర్గం నుంచి పలువురు నాయకులు టికెట్ ఆశిస్తున్నారు. ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు వెరబెల్లి రఘునాథ్‌రావు, సీనియర్ నాయకులు ముల్కల మల్లారెడ్డి, తుల ఆంజనేయులు, తుల మధుసూదన్, డాక్టర్ రఘునందన్ తదితరులు టికెట్ ఆశిస్తున్నారు. వీరిలో మల్లారెడ్డి, రఘునాథ్ గత ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోయారు. మిగతావారు పోటీ అవకాశం కోసం ఎదురు చూస్తున్నారు. కొంత కాలంగా మంచిర్యాల నియోజకవర్గంలో బీసీ నినాదం తెరపైకి వస్తున్ననేపథ్యంలో పార్టీలో ఉన్న బీసీ నాయకులు సైతం ఈసారి తమకు అవకాశం వస్తుందనే ఆశతో ఉన్నారు.

బెల్లంపల్లి బరిలో..

బెల్లంపల్లి నియోజకవర్గంలో ప్రధాన ఆశావహుల్లో గత ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోయిన కొయ్యాల ఏమాజీసహా, ఇటీవల పార్టీలో చేరిన మాజీ ఎమ్మెల్యే ఏ.శ్రీదేవి ఉన్నారు. వీరి ఇద్దరి పేర్లు ప్రధానంగా వినిపిస్తున్నాయి. కొంతకాలంగా ఇక్కడ ఏమాజీ విస్తృతంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. పార్టీని బలోపేతం చేస్తున్నారు. ఇక జిల్లా పరిధిలోనే ఉన్న ఖానాపూర్ నియోజకర్గ పరిధిలో ప్రధానంగా మాజీ ఎంపీ రమేశ్ రాథోడ్ ఉన్నారు. పెంబీ జెడ్పీటీసీ జానకీ బాయి, హరినాయక్, సట్ల అశోక్ వంటి నేతలు ఆశలు పెట్టుకున్నారు. వీరు కూడా పార్టీ టికెట్ కోసం దరఖాస్తు చేసుకోనున్నారు.

ఉత్తమ గురువులు వీరే..

- ఉత్తమ ఉపాధ్యాయులకు పురస్కారాలు
- ఎట్టికేలకు జాబితా వెల్లడి..
- నేడు కలెక్టరేట్‌లో సత్కారం

మంచిర్యాలఅర్బన్: వివిధ రంగాల్లో విభిన్న అంశాల్లో కృషిచేస్తున్న గురువులకు ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా విద్యాశాఖ ఉత్తమ పురస్కారాలు ప్రకటించింది. జిల్లా స్థాయి ఉత్తమ గురువుల జాబితాను సోమవారం విడుదల చేసింది. ఈవిద్యా సంవత్సరం ఉత్తమ ఉపాధ్యాయులుగా పాఠశాల విద్యాశాఖ ప్రభుత్వ, జెడ్పీ, కేజీబీవీ పాఠశాలల నుంచి 54 మంది, సోషల్ వెల్ఫేర్ పాఠశాలల నుంచి–4, బీసీ గురుకులపాఠశాలల నుంచి – 2, ప్రైవేట్ పాఠశాలల నుంచి 30 మంది ఉత్తమ ఉపాధ్యాయులుగా మొత్తం 90 మందిని ఎంపిక చేశారు. ఈనెల 5న ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా సమీకృత కలెక్టరేట్‌లో పురస్కారం ప్రదానం చేయనున్నారు. ఎంపికైన ఉపాధ్యాయులు మధ్యాహ్నం 1 గంటకు హాజరు కావాలని డీఈవో యాదయ్య సూచించారు.

జిల్లాలో ఉత్తమ ఉపాధ్యాయులు..

జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న 37 మందిని ఉత్తమ ఉపాధ్యాయులుగా గుర్తించారు. పోచయ్య (ఎంఈవో మంచిర్యాల), సాంబమూర్తి జీహెచ్ఎం దొడపల్లి, జయప్రద –జీహెచ్ఎం జెడ్పీహెచ్ఎస్ ద్వారాక. కేవీ.సత్యనారాయణ – ఎంపీయూపీఎస్, రడబంబాల బస్తీలు, విజయ్‌కుమార్ –ఎంపీయుపీఎస్ బూర్గుపల్లి, హరిప్రసాద్ – జెడ్పీఎస్ఎస్ వీజ్‌గాం, భిక్షపతి – జెడ్పీహెచ్ఎస్ కొమ్మెర, వెంకటస్వామి–ఎంపీయూపీఎస్ సోమనపల్లి, నీలేశ్ కుమార్– జెడ్పీఎస్ఎస్ ద్వారక, రాజేశ్వర్‌రావు –జెడ్పీఎస్ఎస్ దండేపల్లి, రాజయ్య –జెడ్పీహెచ్ఎస్ బాదంపల్లి, సోమశెట్టి పద్మ– జెడ్పీఎస్ఎస్ కన్నెపల్లి, సురేష్– జెడ్పీహెచ్ఎస్, ధర్మారావుపేట్, నారాయణరావు– జెడ్పీహెచ్ఎస్ సిర్సా, లక్ష్మీతులసి – జెడ్పీఎస్ఎస్ లక్సెట్టిపేట, సాంబయ్య– జీహెచ్ఎస్ చెన్నూర్‌రోడ్, వీఎస్ విమలాదేవి, జీహెచ్ఎస్ గర్మిళ్ల, దామోదర్‌రెడ్డి జెడ్పీహెచ్ఎస్ బాయ్స్ రామకృష్ణాపూర్, హైమవతి– జెడ్పీహెచ్ఎస్ మందమర్రి, రాజేశం– జెడ్పీహెచ్ఎస్ రేచిని, శిరీష– జెడ్పీహెచ్ఎస్ రేచిని, నరేందర్‌రెడ్డి జెడ్పీఎస్ఎస్ వేమనపల్లి, మధుసూదన్‌శర్మ– జీహెచ్ఎస్ బెల్లంపల్లి, షహీన్‌సుల్తానా– ఎంపీపీఎస్ వేమనపల్లి, శ్రీనివాస్– ఎంపీపీఎస్ చంద్రవెల్లి, కె.శారద– ఎంపీపీఎస్ కోటపల్లి, రవీందర్– ఎంపీయుపీఎస్ ఆరెపల్లి, శ్రీలత– ఎంపీపీఎస్ వీజ్‌గాం, విక్రమ్– ఎంపీపీఎస్ జగ్గయపేట్, బి.శ్రీలత– ఎంపీపీఎస్ పెద్దపేట, వెంకటేశం– ఎంపీపీఎస్ బాబానగర్, మధుసూదన్– ఎంపీయూపీఎస్ కాస్కూర్, సుమతి–ఎంపీయూపీఎస్ దొరగారపల్లి, జైపూర్, జి.శ్రీలత– ఎంపీయూపీఎస్ రేండ్లగూడ, ప్రభాకర్ ఎంపీపీఎస్– పోన్కల్, ఆనంద్– ఎంపీయూపీఎస్ లింగాల, రాజేశ్వర్–ఎంపీపీఎస్ కొత్తూర్‌పల్లి, శోభ– ఎంపీయూపీఎస్ పెద్దనపల్లి, బుచ్చన్న –ఎంపీపీఎస్ భావనపల్లి, కె.శ్రీనివాస్– ఎంపీపీఎస్ బస్టాండ్ లక్సెట్టిపేట్, రాజేశ్– జీపీఎస్ న్యాగర్లిక్ష, సాగర్– జీపీఎస్ హమాలివాడ, నిర్మలదేవి–ఎంపీపీఎస్ కల్యాణఖని, సునిదేవి–ఎంపీపీఎస్ అదిల్‌పేట్, స్రవంతి– ఎంపీయూపీఎస్, సింగపూర్, మహేశ్వరి– ఎంపీపీఎస్ –ఆర్కే8, శోభరాణి–ఎంపీయూపీఎస్ జెండావెంకటపూర్, రవీందర్–ఎంపీపీఎస్ మైలారం, రజిత– ఎంపీపీఎస్ అశోక్‌నగర్, శీల– ఎంపీపీఎస్ గోర్లపల్లి, పరిమిళ– ఎంపీపీఎస్ బాదంపల్లి, లింగయ్య– జెడ్పీఎస్ఎస్ ఆకెనపల్లి, వావాల శ్రీనివాస్ –జెడ్పీహెచ్ఎస్ కలమడుడు, కవిత –స్పెషల్ ఆఫీసర్ ,కేజీబీవీ భీమిని ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు. టీఎస్ డబ్ల్యూఆర్ పాఠశాలల నుంచి బాల భాస్కర్ –టీఎస్‌డబ్ల్యూఆర్ఎస్ జెసీ (బాయ్స్), జైపూర్, సైదులు ప్రిన్సిపాల్, టీఎస్‌డబ్ల్యూఆర్ఎస్(బాయ్స్) బెల్లంపల్లి, మహేశ్వరావు టీఎస్‌డబ్ల్యూఆర్ఎస్ , లక్సెట్టిపేట(గర్ల్స్), పరమేశ్వరి–టీఎస్‌డబ్ల్యూఆర్ఎస్(జీ), బెల్లంపల్లి, ఎంజేబీటీబీసీడబ్ల్యూఆర్ పాఠశాలల నుంచి గౌతమ్ రెడ్డి ప్రిన్సిపాల్ లక్షెట్టిపేట్, శ్రీధర్– ప్రిన్సిపాల్ మంచిర్యాలను ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపిక చేశారు. వీరితోపాటు మరో 30 మందిని ప్రైవేట్ పాఠశాలల నుంచి ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపిక చేశారు.

ఓటు హక్కు వినియోగించుకోవాలి

- కలెక్టర్ బదావత్ సంతోష్

నస్పూర్: ఎన్నికల సమయంలో జిల్లాలో ఓటు హక్కు గలిగిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి బదావత్ సంతోష్ తెలిపారు. సమీకృత కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో డీఆర్డీవో శేషాద్రి, మంచిర్యాల ఆర్డీవో రాములు, జిల్లా సంక్షేమ అధికారి చిన్నయ్య, మండల విద్యాధికారులు, ఐకేపీ, మెప్మా ఉద్యోగులు, జూనియర్ డిగ్రీ కళాశాలల ప్రిన్సిపాళ్లతో సమావేశం నిర్వహించారు. యువ ఓటరు నమోదు, ఓటరు జాబితాలో మార్పులు, సవరణలు, తొలగింపులపై సమీక్ష చేశారు. అర్హులందరినీ ఓటరుగా నమోదు చేయాలని సూచించారు.

'గృహలక్ష్మి' ప్రక్రియ త్వరగా పూర్తిచేయాలి..

ప్రభుత్వం ప్రవేశపెట్టిన గృహలక్ష్మి పథకం లబ్ధిదారుల ఎంపిక కోసం ఆన్‌లైన్ ప్రక్రియ త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ సంతోష్ సూచించారు. ముఖ్య ప్రణాళిక అధికారి జి.సత్యం, బెల్లంపల్లి ఆర్డీవో సురేశ్‌తో కలిసి ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లతో గృహలక్ష్మి పథకంపై సమీక్ష నిర్వహించారు. మున్సిపాలిటీల రూ.25 కోట్లు, గ్రామ పంచాయతీలకు రూ.10 లక్షల చొప్పున ప్రభుత్వం మంజూరు చేసినందున పనులను గుర్తించాలని సూచించారు.

పోషణ మాసం విజయవంతం చేయాలి..

జిల్లాలోని మహిళా, శిషు సంక్షేమం కోసం చేపట్టిన పోషణమాసం విజయవంతం చేయాలని కలెక్టర్ సూచించారు. ఈనెల 30 వరకు గ్రామ, మండల, జిల్లా స్థాయిలో పోషణ మాసం కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఎత్తు, బరువు ఎదుగుదలలో లోపం ఉన్న వారిని గుర్తించి సమయానుగునంగా వారికి పోషకాహారం అందించాలని సూచించారు. అనంతరం అందరితో పోషణ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో సంక్షేమ అధికారులు, సీడీపీవోలు సూపర్‌వైజర్లు, పోషణ్ అభియాన్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పండ్ల తోటల సాగును ప్రోత్సహించాలి

మంచిర్యాలఅగ్రికల్చర్: జిల్లాలో పండ్ల తోటల సాగు విస్తీర్ణం పెంచాలని, రైతులను ప్రోత్సహించాలని కలెక్టర్ బదావత్ సంతోష్ సూచించారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బదావత్ సంతోష్

సమీకృత కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఉద్యానవన శాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. ప్రత్యామ్నాయ పంటలు సాగుచేసి అధిక దిగుబడి, ఆర్థికాభివృద్ధి చెందేలా రైతులను ప్రోత్సహించాలని సూచించారు. 2023–24 సంవత్సరానికి గాను 2,535 ఎకరాల్లో పండ్ల తోటలు సాగుచేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. 1,200 ఎకరాల భూమితోపాటు సాగు రైతులకు గుర్తించి ఎంపీపీ రిజిస్ట్రేషన్ చేయడం జరుగుతుందన్నారు. పండ్ల తోటల సాగుకు ప్రభుత్వం అందించే రాయితీ వివరాలను రైతులకు తెలియజేయాలని సూచించారు. జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శేషాద్రి, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి ఉదయ్‌కుమార్ పాల్గొన్నారు.

అర్హత గల ప్రతీ రైతుకు రుణమాఫీ

నస్పూర్: తెలంగాణ ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం పని చేస్తుందని రాష్ట్ర ఆర్థిక ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు తెలిపారు. హైదరాబాద్ నుంచి మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారితో కలిసి కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, అధికారులతో ప్రభుత్వ పథకాల అమలు, లక్ష్యాలు, ఆసరా పెన్షన్లు, కారుణ్య నియామకాలు, ఇళ్ల స్థలాల పట్టాల పంపిణీ , గృహలక్ష్మి, జీవో 59 అంశాలపై సోమవారం సమీక్ష నిర్వహించారు. అర్హత గల ప్రతీ రైతుకు రుణ మాఫీ సొమ్ము అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో కలెక్టర్ బదావత్ సంతోష్, అదనపు కలెక్టర్ మోతీలాల్, డీఆర్డీవో శేషాద్రి, సంబంధిత శాఖ అధికారులు పాల్గొన్నారు.

'ముసురు'కున్న వాన

- సోమవారం రోజంతా వర్షం
- నిండుగా చెరువులు, కుంటలు

మంచిర్యాలఅగ్రికల్చర్: జిల్లాలో వర్షం 'ముసురు'కుంది శనివారం సాయంత్రం మొదలైన వర్షాలు, ఆదివారం, సోమవారం రోజంతా కురుస్తూనే ఉన్నాయి. దీంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. తాజా వర్షాలు పంటలకు జీవం పోశాయి. ఎండలకు వడలిపోతున్న పత్తి చేన్లు, నెర్రలు బారుతున్న వరి పొలాలకు ఈ వర్షాలు ఎంతగానో మేలు చేశాయి. పత్తి, కంది, వరి పంటల్లో రైతులు ఎరువులు వేస్తున్నారు. జిల్లాలో ఆదివారం రాత్రి నుంచి సోమవారం ఉదయం వరకు 46.6 మిల్లీమీటర్ల సగటు వర్షపాతం నమోదైంది. మండలాల వారీగా చూస్తే జైపూర్ 89.1, జన్నారం 79, భీమారం 65, చెన్నూర్ 66, నస్పూర్ 55.6, లక్సెట్టిపేట 54.6, వేమనపల్లి 47.5, కోటపల్లి 48.7, తాండూర్ 45.4, కాసిపేట 40.3, భీమిని 37.9, మందమర్రి 37.6, హాజీపూర్ 32.1, బెల్లంపల్లి 30.6, నెన్నెల 28, మంచిర్యాల 27.4, కన్నెపెల్లి 17.8 మిల్లి మీటర్ల వర్షపాతం నమోదైంది. ఇప్పటి వరకు జిల్లా సాధారణ వర్షపాతం 796.5 మిల్లీమీటర్లు కాగా 800.7 మిల్లీమీటర్లు కురిసింది. జన్నారం, దండేపల్లి, కాసిపేట, జైపూర్ మండలాల్లో 20 నుంచి 26 శాతం అధిక వర్షపాతం నమోదు కాగా, భీమిని, కన్నెపెల్లి, నెన్నెల మండలాల్లో 20 నుంచి 30 శాతం లోటు నెలకొంది. 11 మండలాల్లో సాధారణ వర్షపాతం నమోదైంది.



చెరువును తలిపిస్తున్న ప్రధాన రాహదారి

జన్నారంలో భారీ వర్షం

జన్నారం: జన్నారం మండలంలో సోమవారం భారీ వర్షం పడింది. గంటన్నరపాటు ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షానికి రోడ్లు జలమయమయ్యాయి. ప్రధాన రహదారి చెరువును తలపించింది. రాకపోకలు నిలిచిపోయాయి. జనజీవనం స్తంభించింది. వాగులు పొంగిపొర్లాయి.

వేమనపల్లిలో..



బురదగా మారిన మత్తిడివాగు వంతెన అప్రోచ్‌రోడ్డు

వేమనపల్లి: మండలంలో సోమవారం ఉదయం నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. పత్తి, మిరప, వరి పొలాల్లో వ్యవసాయ పనులు ఊపందుకున్నాయి. మండల కేంద్రానికి సమీపంలో ఉన్న మత్తడి వాగు వంతెన, మంగెనపల్లి – నాగారాం రోడ్డు బురదమయంగా మారింది.

నిండుకుండలా గొల్లవాగు ప్రాజెక్టు..

భీమారం: మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మండల కేంద్రం సమీపంలోని గొల్లవాగు ప్రాజెక్టులోకి భారీగా వరద చేరుతోంది. దీంతో ప్రాజెక్టు నిండుకుండలా మారింది. సోమవారం కూడా భారీ వర్షం కురవడంతో వాగు ఉప్పొంగి వరద నీళ్లు ప్రాజెక్టులోకి చేరుతున్నాయి. పూర్తి నీటిమట్టం 155.500 మీటర్లకు చేరింది. మండలంలోని చెరువులు మత్తడి దూకుతున్నాయి.



నిండు కుండను తలపిసుతన్న గొల్లవాగు ప్రాజెక్టు

నిండుకుండలా 'ఎల్లంపల్లి'

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం గుడిపేట గ్రామ శివారులో గోదావరిపై నిర్మించిన ఎల్లంపల్లి జలాశయం నిండుకుండలా మారింది. మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ప్రాజెక్టు లోకి 50 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. ప్రాజెక్టు నీటి మట్టం 148 మీటర్లు కాగా, 147.58 మీటర్లకు చేరింది. నీటి నిల్వ మొత్తం 20.175 టీఎంసీలకు 18.992 టీఎంసీలుగా నిర్వహిస్తున్నారు. 8 గేట్లను ఎత్తి 45 వేల క్యూసెక్కుల నీటిని గోదావరిలోకి వదులుతున్నారు.



ఎన్‌సీసీ మంజూరుకు హోంమంత్రి హామీ



హోం మంత్రికి వినతిపత్రం ఇస్తున్న ప్రిన్సిపాల్

లక్సెట్టిపేట: ఆదర్శ కళాశాలకు ఎన్‌సీసీ మంజూరు చేయాలని ప్రిన్సిపాల్ జైకిషన్ ఓఝా, హోం మంత్రి మహమూద్ అలీని సోమవారం కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు, క్రమ శిక్షణ, దేశ సమగ్రత కోసం ఎన్‌సీసీ ఉపయోగపడుతుందని తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని కళాశాలకు ఎన్‌సీసీ యూనిట్‌ను మంజూరుకు హోంమంత్రి హామీ ఇచ్చినట్లు తెలిపారు.

ఓబీసీలకు రిజర్వేషన్లు అమలు చేయాలి

మంచిర్యాలటౌన్: ప్రభుత్వరంగ సంస్థలు, విద్యా సంస్థల్లో నిజమైన ఓబీసీలకు రిజర్వేషన్లు అమలు చేయాలని జాతీయ ఓబీసీ కమిషన్ చైర్మన్ హన్సరాజ్ గంగారామ్ అహిర్ అన్నారు. రామగుండం పర్యటనకు వెళ్తున్న ఆయన మంచిర్యాల జిల్లా కార్యాలయంలో సోమవారం ఆగారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ వారికి స్వాగతం పలికారు. అనంతరం హన్సరాజ్ మాట్లాడారు. ప్రభుత్వరంగ సంస్థలైన సింగరేణి, ఎన్టీపీసీ, ఆర్ఎఫ్‌సీఎల్ ఓబీసీలకు కల్పి స్తున్న రిజర్వేషన్లపై సమీక్ష నిర్వహించడం జరుగుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం 40 ఉప కులాలను అందులో హిందూ కులాలు 26, 14 ముస్లీం కులా లను ఓబీసీలో చేర్చడానికి కేంద్ర ప్రభుత్వానికి ప్రతి పాదనలు పంపించడం జరిగిందన్నారు. వాటిపై రేపు ఢిల్లీలో ఉన్నత అధికారులతో సమీక్ష నిర్వహించి త్వరలోనే నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. అనంతరం పలువురు బీసీ సంఘాల నాయకులు బీసీల సమస్యలపై వినతిపత్రం అందజేశారు.

బీసీ జనగణన చేపట్టాలని వినతి

పాతమంచిర్యాల: బీసీ జనగణన చేపట్టాలని తెలంగాణ బీసీ జాగృతి జిల్లా అధ్యక్షుడు నరెడ్ల శ్రీనివాస్ కోరారు. జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో జాతీయ బీసీ కమిషన్ చైర్మన్ హన్స్‌రాజ్ గంగారాం అహిర్‌ని సోమవారం కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీ జనగణన చేపడితే బీసీలకు విద్య ఉద్యోగాలు స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు పెంచాల్సి వస్తుందని కేంద్రం వెనుకాడుతోందని ఆరోపించారు. జాతీయ బీసీ కమిషన్ చైర్మన్ హన్స్‌రాజ్ గంగారాం మాట్లాడుతూ బీసీల సమస్యలను కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బీసీ జాగృతి నియోజకవర్గం వర్కింగ్ ప్రెసిడెంట్ రమేశ్ పట్టణ అధ్యక్షుడు వైద్య భాస్కర్, ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్, నాయకులు సదానందం, బియ్యాల సత్తయ్య, పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జాతీయ ఓబీసీ కమిషన్ చైర్మన్ హన్సరాజ్ గంగారామ్ అహిర్

క్లుప్తంగా

పాముకాటుకు ఒకరు మృతి



మనోజ్‌కుమార్ మృతదేహం

దహెగాం(సిర్పూర్): పాముకాటుకు ఒకరు మృతిచెందిన ఘటన మండలంలోని పీకలగుండంలో చోటుచేసుకుంది. కుటుంబీకులు తెలిపిన వివరాలు.. ఆదివారం రాత్రి ఇంట్లో కొడిపె మనోజ్‌కుమార్(16) నిద్రిస్తున్నాడు. రాత్రి 2 గంటల ప్రాంతంలో పాముకాటేసింది. ఏదో కుట్టిందని ఇంట్లో చెప్పాడు. సోమవారం ఉదయం కుంచవెల్లి వరకు ప్రైవేటు వాహనంలో తరలించి అక్కడి నుంచి 108 అంబులెన్సులో స్థానిక పీహెచ్‌సీకి తరలించారు. అప్పటికే పరీక్షించిన వైద్యసిబ్బంది మృతి చెందినట్లు నిర్ధారించారు. విషయం తెలుసుకున్న ఎస్సై సనత్‌కుమార్ పీహెచ్‌సీకి చేరుకుని కుటుంబ సభ్యులకు వివరాలు అడిగి తెలుసుకున్నారు.

లారీ ఢీకొని 11 గొర్రెలు మృతి



మృతి చెందిన గొర్రెలు

జైపూర్: మండలంలోని ఇందారం బస్టాండ్ సమీపంలో గల రాజీవ్ రహదారిపై సోమవారం లారీ ఢీకొని 11 గొర్రెలు మృతి చెందాయి. స్థానికులు తెలిపిన వివరాలు.. రేచినికు చెందిన గొల్లకాపరి ముద్వి రమేశ్ ఇందారం సమీపంలో గొర్రెలు పెంచుతూ సంచార జీవనం సాగిస్తున్నాడు. ఇదేక్రమంలో ఇందారం ఈసూబ్ ఫంక్షన్‌హాల్ సమీపంలో గొర్రెలు మేపుతుండగా శ్రీరాంపూర్ నుంచి గోదావరిఖని వైపు వెళ్తున్న లారీ గొర్రెల మందను ఢీకొట్టడంతో 11 గొర్రెలు అక్కడికక్కడే మృతి చెందాయి. వీటి విలువ సుమారు రూ.లక్షకు పైగా ఉంటుందని బాధితుడు వాపోయాడు.

చెరువులో పడి ఒకరి మృతి

భీమిని: చెరువులో ప్రమాదవశాత్తు పడి ఒకరు మృతి చెందినట్లు ఎస్సై నరేశ్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం..కన్నెపల్లి మండలం కొత్తపల్లికి చెందిన పెద్దల ఎర్రయ్య (50) వ్యవసాయ కూలీగా పనిచేస్తున్నాడు. ఈయనకు ఇద్దరు భార్యలు. సంతానం లేదు. కొన్నేళ్లుగా ఎర్రయ్య మద్యానికి బానిసయ్యాడు. ఎంతకీ మద్యం మానకపోవడంతో భార్యలు ఇంటి నుంచి వెళ్లిపోయారు. ఈ క్రమంలో తల్లి చిన్నక్క వద్ద ఉంటున్నాడు. మనస్తాపంతో అప్పటి నుంచి మద్యం తాగుతూనే ఉన్నాడు. గతనెల 30న ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. సోమవారం కొత్తపల్లి చెరువులో ఎర్రయ్య మృతదేహం తేలడంతో పశువుల కాపర్లు గమనించి కుటుంబీకులు, పోలీసులకు సమాచారం అందించారు. మృతుడి తల్లి చిన్నక్క ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పిడుగుపాటుకు రెండు మేకలు మృతి



మృతి చెందిన మేకలు

కెరమెరి: మండలంలోని సీంగూడ గ్రామంలో రైతు మొహర్లే రాజుకు చెందిన రెండు మేకలు పిడుగుపాటుకు సోమవారం మృతి చెందాయి. మధ్యాహ్నం వర్షం కురుస్తుండగా పొలం గట్టుపై మేకలపై గడ్డి మేస్తోంది. ఒక్కసారి పిడుగుపడడంతో అక్కడికక్కడే మృతిచెందాయి. వీటి విలువ రూ.24 వేలు ఉంటుందని బాధిత రైతు తెలిపాడు.

బోధనలో ఉత్తమం

- ఫలితాలు సాధించేలా టీచర్ల కృషి
- సొంత ఖర్చులతో పుస్తకాలు
- సేవల్లో భాగస్వాములవుతూ..

ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు వినూత్న రీతిలో విద్యాబోధన చేస్తున్నారు. విద్యార్థుల్లో పఠనాసక్తి కలిగించి నూతన పద్ధతులు, ప్రయోగాల ద్వారా వివరిస్తున్నారు. పిల్లలు మంచి ఫలితాలు సాధించేలా కృషి చేస్తున్నారు. మరికొందరు సేవా కార్యక్రమంలోనూ భాగస్వాములవుతున్నారు. డా.సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా ఏటా సెప్టెంబర్ 5న ఉపాధ్యాయుల దినోత్సవం నిర్వహిస్తారు. ఉత్తమ సేవలందిస్తున్న టీచర్లపై 'సాక్షి' కథనం.





విద్యార్థులకు బోధిస్తున్న శ్రీలత

పిల్లల కోసం ఆటో ఏర్పాటు

దండేపల్లి: మండలంలోని పెద్దపేట ప్రాథమిక పాఠశాల అభివృద్ధికి, హెచ్‌ఎం శ్రీలత చేస్తున్న సేవలు ఎనలేనివి. గతంలో విద్యార్థుల సంఖ్య 21. అక్కడ ఆమె విధుల్లో చేరిన తర్వాత, ఆ సంఖ్య 62కు చేరింది. పిల్లలు బడికి వచ్చేందుకు హెచ్‌ఎం ప్రతీనెల రూ.3 వేలు ఖర్చు చేస్తూ, ఓ ఆటో ఏర్పాటు చేసింది. మన ఊరు–మనబడిలో పాఠశాల ఎంపిక కావడంతో పాఠశాలలో మౌలిక వసతులు పెంపొందించారు. డ్యుయల్ డెస్క్ బెంచీలు, పాఠశాలను కార్పొరేట్‌గా తీర్చిదిద్దారు.

కార్పొరేట్.. సావర్‌కెడా పాఠశాలగా తీర్చిదిద్ది

కెరమెరి(ఆసిఫాబాద్): మండలంలోని సావర్‌కెడా పాఠశాలలో 2010 నవంబర్ 4న హెచ్‌ఎంగా కడెర్ల రంగయ్య బాధ్యతలు చేపట్టారు. అప్పటి నుంచి కార్పొరేట్ మాదిరిగా బడిని తీర్చిదిద్దారు. నాణ్యమైన విద్య అందించడంతో 120 మంది విద్యార్థులు వివిధ గురుకులాల్లో ప్రవేశం పొందారు. 9 మంది హైదరాబాద్‌లోని చుక్కా రామయ్య ట్రస్ట్‌లో సీటు సాధించారు. తల్లిదండ్రులు, దాతల నుంచి రూ.10 లక్షలు విరాళాలు సేకరించి పలు కార్యక్రమాలు చేపట్టారు. 'సార్'సినిమా దర్శకుడు అట్లూరి వెంకి ప్రత్యేకంగా హైదరాబాద్‌కు పిలిపించి ఆయన గురించి తెలుసుకున్నారు. పాఠశాలలు, గ్రంథాలయాల అభివృద్ధి కోసం రూ. 3 లక్షల విరాళం చేశారు. వచ్చిన డబ్బులను రంగయ్య జిల్లాలోని వివిధ పాఠశాలలకు, గ్రంథాలయాల ఏర్పాటుకు అందించారు. ఆ పాఠశాల మన ఊరు–మన బడి పనులు కొనసాగుతున్నాయి. కాగా మార్చి 24న ఆ పాఠశాలను రాష్ట్ర విద్యాశాఖ కమిషనర్, స్టేట్ ప్రాజెక్టు డైరెక్టర్ ఏ.దేవసేనా సందర్శించి మెచ్చుకున్నారు. ఆయన సేవలకు గుర్తింపుగా 2021లో కేంద్రం జాతీయ ఉత్తమ అవార్డుతో సత్కరించింది.



సన్మానిస్తున్న శ్రీ దేవసేన, కలెక్టర్ హేమంత్ బోర్కడే, ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయ్, డీఈవో అశోక్

జీతం తీసుకోకుండా పాఠాలు



పాఠాలు బోధిస్తున్న వీణ

కడెర్ల రంగయ్య సతీమణి కడెర్ల వీణ. ఆయన అడుగుజాడల్లో నడుస్తూ సావర్‌కెడా పాఠశాల విద్యార్థులకు ఉచిత విద్య అందిస్తోంది. 2013 నుంచి జీతం తీసుకోకుండా పాఠాలు చెబు తో ంది. విద్యార్థులకు సరిపడా ఉపాధ్యాయులు లేకపోవడంతో వీణ తన సేవలందిస్తోంది. భర్త చేస్తున్న సేవల్లో తాను సైతం అంటూ బడి బాగుకోసం ఎంతో కృషి చేశారు. ఆమె అందిస్తున్న సేవలకు గాను ఈ మార్చిలో సావిత్రీబాయి పూలే రాష్ట్రస్థాయి అవార్డు అందుకుంది.

బడికి తీసుకెళ్తూ



బోధిస్తున్న ఉపాధ్యాయుడు ప్రవీణ్‌కుమార్

కోటపల్లి: కోటపల్లి ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు చకినారపు ప్రవీణ్‌కుమార్. బడికి రాని విద్యార్థుల ఇళ్లకెళ్లి వారిని తీసుకెళ్తున్నాడు. సులభ పద్ధతుల్లో పాఠాలు బోధించడం, సొంత ఖర్చులతో చార్ట్స్, డ్రాయింగ్, మెటీరియల్స్ అందిస్తున్నాడు. రెండేళ్ల నుంచి విద్యార్థులు గురుకుల తదితర పోటీ పరీక్షల్లో ప్రతిభ కనబర్చారు.

సూపర్ మేడం



కోటపల్లి మండలం ఎడగట్ట ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయురాలు పొసక్క. విద్యార్థులు బడికి వచ్చేలా చర్యలు తీసుకున్నారు. పిల్లలు వ్యవసాయ పనులకు వెళ్తే తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ నిర్వహించి బడికి వచ్చేలా ప్రత్యేక శ్రద్ధ చూపారు. మొక్కలు నాటి పాఠశాలను పచ్చదనంగా మార్చారు. ఆ టీచర్‌ను సూపర్ మేడం అంటూ పలువురు అభినందిస్తున్నారు.

ఎస్‌సీఈఆర్టీ పుస్తకంలో చోటు



కౌటాల: ఎస్‌సీఈఆర్టీ విడుదల చేసిన పుస్తకంలో కౌటాల మండలంలోని నాగెపల్లి ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం నాయిని శ్రీనివాస్ కార్యక్రమాలు ప్రచురితమయ్యాయి. నాగెపల్లి పాఠశాలలో 63 మంది చదువుతున్నారు. విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు ఆయన ప్రత్యేక ప్రచార కార్యక్రమాలు చేపడుతున్నారు. గతేడాది ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు సైతం అందుకున్నారు. అలాగే మహిళల్లో చైతన్యం కల్పించేందుకు 'మహిళా ఆరోగ్య చైతన్య' పేరుతో సంఘాన్ని ఏర్పాటు చేశారు. మద్యంతో కలిగే అనర్థాలపై విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు.

పడవపై వెళ్లి..పాఠాలు చెప్పి



పడవ ప్రయాణం చేస్తున్న రజిత, శిరీష

కెరమెరి(ఆసిఫాబాద్): రోడ్డు సౌకర్యం లేకున్నా.. పాఠశాలకు వెళ్లాలన్నా తపన వారిని పడవ ఎక్కించింది. టీచర్లు రజిత, శిరీష ఐదేళ్లుగా పడవ ప్రయాణం చేసి పిల్లలకు పాఠాలు బోధిస్తున్నారు. ఈ ఇద్దరు ఆసిఫాబాద్‌లో ఇల్లు అద్దెకు తీసుకున్నారు. అక్కడి నుంచి ప్రతీరోజు కెరమెరి మండలం ఇందాపూర్ ప్రాథమికోన్నత పాఠశాలకు వచ్చి పాఠాలు చెబుతున్నారు. ఆసిఫాబాద్ నుంచి ధనోరా వరకు బస్సులో వస్తారు. ధనోరా నుంచి రవాణా సౌకర్యం లేకపోవడంతో సావర్‌ఖేడా గ్రామానికి చెందిన సదూ (పడవ నడిపే వ్యక్తి), శంకర్ బైక్‌పై ఇందాపూర్ పెద్దవాగు వరకు తీసుకెళ్తారు. ఇందుకు ప్రతినెల సదూకు. రూ.5 వేలు అందిస్తున్నారు.

పాఠశాలలో చదివి టీచర్‌గా మారి..

పెంచికల్‌పేట్: తన ఊరిలో చదువుకున్న ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యాడు. షెడ్వాయికు చెందిన చౌదరి వెంకటేశ్. తాను విధుల్లో చేరిన సమయంలో విద్యార్థుల సంఖ్య 36 ఉంది. వీవీగా పని చేసిన అనుభవంతో ఆ సంఖ్యను పెంచేందుకు కృషి చేశాడు. ఇన్‌చార్జి హెచ్‌ఎంగా పని చేస్తూ మూడేళ్లల్లో విద్యార్థుల సంఖ్య 266కు చేరుకుంది. పాఠశాలలో ఆటస్థలం, మరుగుదొడ్లు, తరగతి గదులను అభివృద్ధి చేశారు. తొలిమెట్టులో రాష్ట్ర స్థాయిలో మాడ్యూల్స్ తయారీలో భాగస్వామ్యం వహించాడు.



బోధిస్తున్న ఉపాధ్యాయుడు వెంకటేశ్

ఉత్తమ విద్య 'గురుకులం'



ఆన్‌లైన్‌లో బోధన చేస్తున్న ప్రిన్సిపాల్

బెల్లంపల్లి: బెల్లంపల్లిలోని తెలంగాణ ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్సీ (సీవోఈ)లో ఉపాధ్యాయులు ఉత్తమ విద్య అందిస్తున్నారు. కరోనా విపత్కర పరిస్థితుల్లోనూ విద్యార్థులకు ఆన్‌లైన్‌లో విద్యబోధన చేశారు. గురుకులంలో 8 మంది బోధన సిబ్బంది ఉత్తమ ఉపాధ్యాయులుగా అవార్డులు అందుకుని రికార్డు సృష్టించారు. గతేడాది గణిత ఉపాధ్యాయుడు ప్రమోద్‌కుమార్ ఉత్తమ ఉపాధ్యాయుడు అవార్డు పొందారు. ప్రిన్సిపాల్ ఐనాల సైదులు రాష్ట్రస్థాయిలో 2 సార్లు ఉత్తమ ప్రిన్సిపాల్ అవార్డు అందుకున్నారు.

కళలతో బోధన

ఆసిఫాబాద్‌రూరల్: విద్యార్థులకు కళలతో బోధన చేస్తున్నాడు వెంకట్రావు. సొంత ఖర్చులతో 100 మంది విద్యార్థులకు అభ్యాసనపత్రాలను జిరాక్స్ తీసి వాటిని ఫైల్ కవర్‌లో పెట్టి దానితో పాటు నోట్ పుస్తకం అందిస్తారు. వాటితో వారికి అభ్యసన సామర్థ్యాలు సాధించేలా బోధన చేస్తారు. కవి, గాయకుడు, కళాకారుడిగా జిల్లాలో ఉత్తమ బహుమతులు అందుకోగా, 2013 ఉమ్మడి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం పొందారు.



కళా ప్రదర్శన ఇస్తున్న వెంకట్రావు

పోలీసు అధికారుల సమావేశం

జన్నారం/కడెం: రామగుండం సీపీ రెమా రాజేశ్వరి ఆదేశాలతో జన్నారంలోని హరిత రిసార్ట్‌లో సోమవారం నిర్మల్, మంచిర్యాల జిల్లాల పోలీసు అధికారుల సమావేశం నిర్వహించారు. మంచిర్యాల ఏసీపీ తిరుపతిరెడ్డి, నిర్మల్ డీఎస్పీ గంగారెడ్డి హాజరయ్యారు. రాబోయే ఎన్నికల దృష్ట్యా సరిహద్దు జిల్లాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ప్రణాళికలు రూపొందించడానికి ముందస్తు సమావేశం నిర్వహించినట్లు ఏసీపీ తిరుపతిరెడ్డి తెలిపారు. సరిహద్దు ప్రాంతాల్లో మావోయిస్టుల ప్రాబల్యం, ఎన్నికల్లో మద్యం, డబ్బు నియంత్రణకు చెక్‌పోస్టులు ఏర్పాటు చేస్తామన్నారు. గంజాయి, మాదకద్రవ్యాల రవాణా నియంత్రణకు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఖా నాపూర్ సీఐ మోహన్, నిర్మల్ రూరల్ సీఐ శ్రీనివాస్, మంచిర్యాల రూరల్ సీఐ సంజీవ్, లక్సెట్టిపేట సీఐ కృష్ణ, ఎస్సైలు సతీశ్, రాజు, ప్రభాకర్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఏసీపీ తిరుపతిరెడ్డి

విద్యుత్ అవసరాలకు బొగ్గు ఉత్పత్తి చేయాలి



వీసీలో పాల్గొన్న శ్రీధర్

నస్పూర్: రాష్ట్ర విద్యుత్ అవసరాలకు అనుగుణంగా తగినంత బొగ్గు ఉత్పత్తి చేయాలని సింగరేణి సీఎండీ ఎన్.శ్రీధర్ పేర్కొన్నారు. సోమవారం ఆయన అన్ని ఏరియాల జీఎంలతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో శ్రీరాంపూర్ ఏరియా జీఎం సంజీవరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోజుకు 2 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తితోపాటు అదేవిధంగా 2.05 లక్షల టన్నుల బొగ్గు రవాణా చేయాలన్నారు. ఆర్థిక సంవత్సరం చివరి నాటికి 720 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి చేయాలని ఆదేశించారు. ఈ ఏడాది మొదటి ఐదు నెలల్లో మెరుగైన బొగ్గు ఉత్పత్తి, రవాణా సాధించి నిర్దేశిత లక్ష్యసాధనకు ముందుకెళ్తుండడంపై హర్షం వ్యక్తం చేశారు. సింగరేణి ఉద్యోగులకు నెల రోజుల్లో రూ.1726 కోట్లు వేజ్‌బోర్డు ఏరియర్స్, ఆ వెంటనే లాబాల వాటా రూ.700 కోట్లు, దీపావళి బోనస్ రూ.300 కోట్లు చెల్లిస్తామన్నారు. మొత్తం రూ.2800 కోట్లు చెల్లింపులు చేయనున్నామని వివరించారు. సగటున ఒక్కో కార్మికుడు రూ.6.5 లక్షలు అందుకోనున్నాడని తెలిపారు. సమావేశంలో ఆర్‌కే 5 అండ్ 6 గ్రూప్ ఏజెంట్ ఏవి రెడ్డి, డీజీఎం ఐఈడీ చిరంజీవులు, క్వాలిటీ మేనేజర్ వెంకటేశ్వర్‌రెడ్డి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

అన్నం కోసం వచ్చి... అసువులుబాసి..



అరుణ్‌కుమార్ మృతదేహం



రాజేందర్ మృతదేహం



ఆసుపత్రి వద్ద రోదిస్తున్న సరోజ

- విద్యుత్ షాక్‌తో భర్త, కొడుకు మృతి
- గుండెలు పగిలేలా రోదించిన తల్లి
- మంచిర్యాల జిల్లా కేంద్రంలో విషాదం

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల:'కొడుకా.. ఓ నా కొడుకా.. నన్ను ఎట్లా సూత్తవు కొడుకా.. బువ్వ కోసం ఇంటికచ్చి, పాణం పోగొట్టుకుంటిరి తండ్రీ.. దేవుడా.. నన్ను కూడా కొంచవో..' అంటూ భర్త, కొడుకును ఒకేసారి కోల్పోయిన బాధితురాలి ఆవేదన అందరినీ కంటతడి పెట్టించింది. జిల్లా కేంద్రంలోని ఏసీసీ కాలనీలో విద్యుత్‌షాక్‌తో ఎడ్ల రాజేందర్(50), కొడుకు అరుణ్ కుమార్(17) సోమవారం మృతిచెందారు. సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్న రాజేందర్, మెకానిక్‌గా పనిచేస్తున్న అరుణ్‌కుమార్ మధ్యాహ్నం భోజనానికి ఇంటికి వచ్చారు. దండెంపై రాజేందర్ టవల్ ఆరేస్తుండగా షాక్‌కు గురయ్యాడు. తండ్రిని కాపాడే ప్రయత్నంలో అరుణ్‌కుమార్ కూడా విద్యుదాఘాతానికి గురయ్యాడు. రెప్పపాటులో భర్త, కొడుకు కళ్ల ముందే మృత్యువాత పడడంతో సరోజన గుండెలు పగిలేలా రోదించింది. ప్రభుత్వాసుపత్రి సరోజ విలపించిన తీరు అందరినీ కంటతడి పెట్టించింది.

తీరని విషాదం

తండ్రి, కొడుకు మరణంతో ఏసీసీ కాలనీలో విషాదం అలుముకుంది. ఆ కుటుంబంలో తీవ్ర దుఃఖం నింపింది. భర్త, కొడుకు మరణం తట్టుకోలేక రోదిస్తున్న సరోజను ఓదార్చడం ఎవరి తరం కావడం లేదు.

ప్రాణం ఉందనుకున్నా...



కరెంట్.. కరెంట్ అని మా వదిన మొత్తుకుంటే.. ఉరికిపోయిన. తీగను పట్టుకుని ముందట అన్న ఉన్నడు. ఎనుక కొడుకు ఉన్నడు. నాకు డౌట్ వచ్చి కట్టెతోని తీగను కొట్టిన ఇద్దరూ కింద పడ్డరు. నా కాళ్లపై పడుకోబెట్టుకుని చాతీ మీద గట్టిగా నొక్కిన. చుట్టుపక్కల వాళ్లు వచిచ సాయం చేసిండ్రు. ఒక్కసారిగా శ్వాస తీసుకున్నరు. పాణం ఉందనుకుని ఆస్పత్రికి తీసుకపోయినం. కానీ ప్రాణాలు దక్కలేదు.

– సారయ్య, రాజేందర్, తమ్ముడు,

రైల్వేస్టేషన్‌లో మరుగుదొడ్లు ప్రారంభం

పాతమంచిర్యాల: పట్టణంలోని రైల్వేస్టేషన్‌లో నూతనంగా నిర్మించిన మరుగుదొడ్లను సోమవారం సికింద్రాబాద్ డీఆర్‌ఎం భర్తేష్‌కుమార్ జైన్ ఆన్‌లైన్‌లో ప్రారంభించారు. కార్యక్రమంలో డీసీఎం విశాల్ అర్జున్, మంచిర్యాల స్టేషన్ మేనేజర్ ముత్తినేని రవీందర్ పాల్గొన్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

లక్సెట్టిపేట: తాళం వేసిన ఇంట్లో గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేశారు. ఏఎస్సై రామయ్య కథనం ప్రకారం.. మండలంలోని బోయవాడలో మేడి సుమలత నివాసం ఉంటోంది. సోదరులకు రాఖీ కట్టేందుకు గతనెల 30న పెద్దపల్లి జిల్లా పొట్యాలకు వెళ్లింది. సోమవారం మధ్యాహ్నం ఇంటికి వచ్చి చూసేసరికి తాళం పగులగొట్టి ఉంది. ఇంట్లో ఉన్న 21 గ్రాముల వెండి పట్టీలు, 7 గ్రాముల బంగారు ఆభరణాలను దొంగలు ఎత్తుకెళ్లారు. ఈమేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

టాటాఏస్ ట్రాలీ బ్యాటరీ చోరీ

తాండూర్: మండలంలోని తంగళ్లపల్లి హన్మాన్ ఆలయం సమీపంలో పార్కింగ్ చేసిన టాటా ఏస్ ట్రాలీ నుంచి బ్యాటరీ ఆదివారం రాత్రి చోరీకి గురైంది. సత్యనారాయణకు చెందిన ట్రాలీ నుంచి గుర్తుతెలియని వ్యక్తులు బ్యాటరీని అపహరించుకు వెళ్లారు. బాధితుడు పోలీసులకు సోమవారం ఫిర్యాదు చేశాడు.

'బీజేపీ అభ్యర్థిని ఎమ్మెల్యేగా గెలిపించాలి'



మాట్లాడుతున్న హన్సరాజ్‌గంగారాం

బెల్లంపల్లి: వచ్చే ఎన్నికల్లో బెల్లంపల్లి అసెంబ్లీ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థిని ఎమ్మెల్యేగా గెలిపించాలని బీసీ కమిషన్ జాతీయ చైర్మన్, కేంద్రమాజీ మంత్రి హన్సరాజ్ గంగారాం కోరారు. బెల్లంపల్లి టేకులబస్తీలో బీజేపీ అసెంబ్లీ నియోజకవర్గ కార్యాలయాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. అంతకుముందు పార్టీ జెండావిష్కరణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వానికి రోజులు దగ్గర పడ్డాయన్నారు. వచ్చేది బీజేపీ ప్రభుత్వమేనని జోస్యం చెప్పారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల పట్ల ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందన్నారు. అనంతరం ఆయన్ను నాయకులు సన్మానించారు. పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొయ్యల ఏమాజీ, జిల్లా అధ్యక్షుడు రఘునాథ్, మాజీ ఎమ్మెల్యే శ్రీదేవి, జిల్లా ప్రధాన కార్యదర్శి రమేశ్, జిల్లా కార్యదర్శి గోవర్ధన్, అధికార ప్రతినిధి కృష్ణదేవరాయులు పాల్గొన్నారు.

పురుగుల మందు తాగి ఆత్మహత్య

బెల్లంపల్లిరూరల్: అనారోగ్య సమస్యలతో జీవితంపై విరక్తితో పురుగుల మందు తాగి ఒకరు మృతి చెందాడు. బెల్లంపల్లి మండలం ఆకెనపల్లి పంచాయతీలో ఈ ఘటన చోటుచేసుకుంది. తాళ్లగురిజాల ఎస్సై నరేశ్, ఏఎస్సై మజారుద్దీన్ కథనం ప్రకారం.. ఆకెనపల్లి పంచాయతీ పరిధిలోని నేతకానివాడకు చెందిన ఆగిడి రాజం పితంబర్(62) కూలీ పని చేసుకుంటూ కుటుంబాన్ని పోషిచుకునేవాడు. మూడేళ్ల క్రితం పక్షవాతానికి గురై ఇంటికే పరిమితమయ్యాడు. ఈ క్రమంలో కాళ్లనొప్పులతో బాధపడేవాడు. అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన జీవితంపై విరక్తితో ఆదివారం సాయంత్రం ఇంటి సమీపంలో పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబసభ్యులు బెల్లంపల్లి ప్రభుత్వాసుపత్రికి, అక్కడి నుంచి మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు. మృతుడికి భార్య చంద్రమ్మ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.